క్లుప్తంగా

వైభవంగా శకటోత్సవం

నవాబుపేట: మండలంలోని ఆది బసవేశ్వర ఆలయంలో బుధవారం శకటోత్సవం వైభవంగా నిర్వహించారు. ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లపై ఊరేగించారు. గురుకుంట, పల్లెగడ్డ, కామారం, నవాబుపేట గ్రామాల ప్రజలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, రంగారావు, సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, లక్ష్మమ్మ, వెంకటేష్, సత్యం, పురుషోత్తం, ఎంపీటీసీలు అనిత, శ్రీనివాస్, రాధాకృష్ణ, నర్సింహులు, పూజారులు శ్రీశైలం, రాజాలింగం, నిర్వాహకులు జంగయ్య, ప్రతాప్, రవి, శ్రీను, పురుషోత్తం, రాములు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ప్రత్యేక పూజలు..

ఆదిబసవేశ్వర దేవాలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

గండీడ్: మండలంలోని సల్కర్‌పేట్‌లో బుధవారం ముదిరాజ్ సంఘం గ్రామ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం మండల ఉపాధ్యక్షుడు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలని అన్నారు. రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జితేందర్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటేశం, ముదిరాజ్ గ్రామ కమిటీ అధ్యక్షుడు తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి రాజు, ఊశన్న, శేఖర్, లక్ష్మయ్య, ఆశన్న పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం



మిడ్జిల్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బుధవారం మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మహేశ్వర్, శ్వేత, రాజలక్ష్మి, స్వాతి, ఆశన్న, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 3వ వార్డు పరిధిలోని ఎనుగొండ బీసీ కాలనీలో పార్కు స్థలాన్ని కృష్ణయ్య అనే వ్యక్తి ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నట్టు కొందరు స్థానికులు ఇటీవల కలెక్టర్ రవినాయక్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆక్రమణలను జేసీబీతో తొలగింపజేశారు.

అలరించిన బాలికల కరాటే విన్యాసాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కొనపాలమూర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం రాష్ట్ర స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ మాస్టర్ ఎతినె చెన్నయ్య ఆధ్వర్యంలో బాలికలు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కటాస్, స్పైరింగ్, జూడోలో బాలికలు ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం షమీంవున్నిసా తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న కుటుంబీకులు

గండీడ్: మండలంలోని పెద్దవార్వాల్‌కు బీఆర్‌ఎస్ కార్యకర్త బొక్క రాములు(57) మంగళవారం విద్యుదాఘతంతో ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బుధవారం ఆయనను పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం సందర్భంగా వైద్యులు అతడి కళ్లు కళ్లు లేని మరొకరికి ఉపయోగించవచ్చని తెలుపగా, కుటుంబీకులను అందుకు ఒప్పుకొని దాతృత్వం చాటారు. బొక్కరాములు అంత్యక్రియలు స్వగ్రామంలో చేపట్టగా, పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య, గోపాల్‌రెడ్డి, రుద్రారెడ్డి, లక్ష్మయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

గొడుగుల పంపిణీ



స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజ సేవలో వాసవీ, వనితా క్లబ్‌లు తమ వంతు భాగస్వామ్యం అవుతున్నాయని వాసవీక్లబ్ జోన్ చైర్మన్ మేడిశెట్టి రమేష్ అన్నారు. వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. వీరన్నపేటలోని శ్రీసరస్వతి శిశు మందిరంలో పదో తరగతి విద్యార్థులకు ట్రైనర్ విశ్వనాథంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న మేడిశెట్టి రమేష్ మాట్లాడుతూ సమాజ సేవలే లక్ష్యంగా వాసవీ, వనితా క్లబ్‌లు పనిచేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి వినోద్, వనితా క్లబ్ ప్రధాన కార్యదర్శి రాధిక, రాము, సుజాత, స్వప్న, గాయత్రి, లత పాల్గొన్నారు.



జేపీఎన్‌సీఈ ఆవరణలో..



దేవరకద్ర బీసీ కాలనీలో..



మిడ్జిల్‌లో..

మహిళా సాధికారిత సాధిద్దాం



బహుమతులు అందించిన అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు సరోజనమ్మ



జిల్లా కేంద్రంలో మహిళా పోలీసు సిబ్బందిని సత్కరిస్తున్న అధికారులు

సాక్షి, నెట్‌వర్క్: మహిళల అభ్యున్నతి కోసం పాటుపడాల్సిన అవసరముందని.. తగిన ప్రోత్సాహం లభిస్తే ఏ రంగంలోనైనా రాణించగలుగుతారని పలువురు వక్తలు అన్నారు. జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కూతురు శ్రీహిత కేక్ కట్ చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసు సిబ్బందిని సత్కరించారు. అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.సరోజనమ్మ ఆధ్వర్యంలో లక్ష్మీనగర్‌కాలనీలోని అరుంధతి భవన్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ట్రెండ్ హ్యుందాయ్ షోరూంతో పాటు రెనాల్ట్ యుక్త మోటార్స్‌లో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. షోరూం ఈడీ గట్టు సంయుక్త రెడ్డి, రెనాల్ట్ యుక్తమోటార్స్ ఎండీ గట్టు సిరిచందనరెడ్డి, ట్రెండ్ గ్రూప్ అధినేత గట్టు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. శాంతా నారాయణ గౌడ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ శ్రీహిత మహిళా సీనియర్ సిటిజన్లను సన్మానించారు. అడ్డాకుల మహిళా సమాఖ్య భవనంలో మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ ధర్మాపూర్‌లోని జేపీఎన్‌సీఈలో మహిళలు కేక్ కట్ చేయించారు. దేవరకద్రలో భూత్పూర్ సీఐ రజితరెడ్డి, మహిళా కానిస్టేబుళ్లను సన్మానించారు. భూత్పూర్ కేఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నజీబ్ అధ్యక్షతన చైర్మన్ బస్వరాజ్ గౌడ్, సీఐ రజితారెడ్డి ఉద్యోగులను సత్కరించారు. రైల్వేస్టేషన్ బీసీ కాలనీలో బీఆర్‌ఎస్ నాయకుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. మిడ్జిల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను సన్మానించారు. జిల్లా కేంద్రంలో జాతీయ మాలల ఐక్యవేదిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. గండీడ్ మండలం సల్కర్‌పేట్ సర్పంచ్ జితేందర్‌రెడ్డి పలువురు మహిళలను సన్మానించారు. నంచర్ల సర్పంచ్ అనసూయ మహిళ ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, పంచాయతీ కార్మికులను సన్మానించారు. హన్వాడ మండల కేంద్రంలో ఎంపీపీ బాల్‌రాజు ఉద్యోగులను సన్మానించారు. పెద్దదర్పల్లిలో ర్యాలీ నిర్వహించారు.



జిల్లా కేంద్రంలోని హ్యుందాయ్ షోరూంలో..



మూసాపేట మండలం మహ్మదుస్సేన్‌పల్లిలో..



సీనియర్ సిటిజన్ మహిళలను సన్మానిస్తున్న శ్రీహిత



భూత్పూర్‌లో మాట్లాడుతున్న సీఐ రజితారెడ్డి



హన్వాడ మండలం పెద్దర్పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

కృతజ్ఞతభావంతో మెలగాలి



మాట్లాడుతున్న పాస్టర్ ఎస్.రాజశేఖర్

స్టేషన్ మహబూబ్‌నగర్: విశ్వాసులు దేవునిపట్ల కృతజ్ఞతభావంతో ఉండాలని మదనపల్లికి చెందిన పాస్టర్ ఎస్.రాజశేఖర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంబీసీ మైదానంలో ఇమ్మానుయేల్ మినిస్ట్రీస్ నిర్వాహకులు పాస్టర్ బి.జెర్మియా ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ వరకు నిర్వహించనున్న సువార్త స్వస్థత మహాసభలు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు మహాసభలో పాస్టర్ ఎస్.రాజశేఖర్ ప్రసంగించారు. రోగాలతో బాధపడేవారు మనస్తాపానికి గురికాకుండా దేవుడిని వేడుకుంటే స్వస్థత చేకూరుస్తారని అన్నారు. అనంతరం స్వస్థత కోసం ప్రార్థనలు నిర్వహించారు. పట్టణ పాస్టర్స్ సంఘం ప్రతినిధులు సుందర్‌పాల్, పరంజ్యోతి, ఏసుపాదం, జాన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ప్రశ్నించే వారిని గెలిపించండి



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వాలు ఉపాధ్యాయులకు చేస్తున్న అన్యాయాన్ని సహించలేక హర్షవర్ధన్‌రెడ్డి 16ఏళ్ల ఉపాధ్యాయ సర్వీస్‌ను వదులుకొని రాజీనామా చేసినట్లు తెలిపారు. తెలంగాణ పీఆర్‌టీయూ సంఘాన్ని స్థాపించి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన హర్షవర్ధన్‌రెడ్డికి ఉపాధ్యాయులంతా మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, జిల్లా ప్రచార కార్యదర్శి సీజే బెనహర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో ప్రచారం..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉపాధ్యాయుల హక్కులే ఎజెండాగా ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల జీటీఏ అభ్యర్థి కాసం ప్రభాకర్‌ను గెలిపించాలని ప్రచార సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పీయూ, కేజీబీవీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి కిశోర్, కోశాధికారి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్రాములు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మైసమ్మ జాతర

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్లలో ముక్కోటి మైసమ్మ జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శకటోత్సవం నిర్వహించారు. ప్రతి ఏటా పెద్ద ఎత్తున నిర్వహించే జాతర ఉత్సవాలకు ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

షర్మిలకు శుభాకాంక్షలు తెలిపిన నాయకుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వైఎస్సార్ టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలకు హైదరాబాద్‌లో పార్టీ మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆర్.రవిప్రకాశ్ శుభాకాంక్షలు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

మిడ్జిల్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ నరసింహ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ ఉన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శ్రీనయ్య

కోయిల్‌కొండ: మండలంలోని పారుపల్లి శ్వేతా విద్యామందిర్ పాఠశాలలో బుధవారం ఎస్‌ఐ శ్రీనయ్య సైబర్ నేరాలపై, మైనర్ వివాహాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా రానున్న పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండా విద్యార్థులు పరీక్షలు రాయాలని కోరారు. అదేవిధంగా ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మైనర్ వివాహాలు చేసుకోవడం ద్వారా ఎలాంటి నష్టాలు జరుగుతున్నాయో వారికి వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకట్‌జీ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

భూత్పూర్: మున్సిపాలిటీలోని గోప్లాపూర్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలయ్యాయి. కొత్త మొల్గరకు చెందిన చింతకాయల శ్రీను మోటార్ సైకిల్‌పై భూత్పూర్ వైపునకు వస్తుండగా, ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో శ్రీనుకు గాయాలు కావడంతో ప్రయాణికులు గమనించి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

మహబూబ్‌నగర్ క్రైం: బహిరంగంగా మద్యం తాగుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు టూటౌన్ పోలీసులు. టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి రైల్వేస్టేషన్ సమీపంలో పబ్లిక్ ఏరియాలో బహిరంగంగా మద్యం తాగుతుంటే అదుపులోకి తీసుకోవడంతో పాటు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇరు కుటుంబాల వాగ్వాదం

ఊర్కొండ: మండలంలోని రాంరెడ్డిపల్లికి చెందిన ఓ యువకుడు గ్రామానికి చెందిన యువతి ఫొటోను మంగళవారం రాత్రి ఫోన్‌లో స్టేటస్ పెట్టుకున్నాడు. గమనించిన యువతి సోదరుడు ఫొటో తొలగించాలని సదరు వ్యక్తికి చెప్పడంతో ఇరు కుటుంబాల వారు గొడవకు దిగారు. గొడవ పెద్దది కావడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకొని సర్దిచెప్పారు. ఇరు కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు. విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

మద్దిగట్లలో ఈదమ్మ బోనాలు



బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

భూత్పూర్: మండలంలోని మద్దిగట్లలో బుధవారం రాత్రి ఈదమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా బోనాల ఊరేగింపులో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బోనాల ఊరేగింపు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు బోనాలతో, నృత్యాలతో ఊరేగింపుగా వీధుల వెంట తిరిగి ఈదమ్మ ఆలయం వద్ద బోనం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, వైస్ ఎంపీపీ నరేష్ గౌడ్, చంద్రమౌళి, సర్పంచ్ ప్రియాంక, నాయకులు నారాయణ గౌడ్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కోసం పకడ్బందీగా చట్టాలు

- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి



జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహిళలు లేకుంటే ఈ సృష్టి లేదని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక చైర్మన్ ఛాంబర్‌లో స్వర్ణసుధాకర్‌రెడ్డిని జెడ్పీ డిప్యూటీ సీఈఓ మొగులప్పతో పాటు ఉద్యోగులు ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం అనేక చట్టాలను తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సూపరింటెండెంట్లు శ్రీహరి, విజయ్‌కుమార్, రవి, ఆనంద్, నాలుగో తరగతి ఉద్యోగులు శేఖర్, జహంగీర్, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో ప్రాధాన్యం



కౌన్సిలర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కేక్‌కట్ చేసి మహిళలలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. మహిళా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. చట్టసభల్లో కూడా మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం మహిళా కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్‌యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ సారిక, మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కేన్సర్‌ను ముందుగానే గుర్తించాలి..

జడ్చర్ల: కేన్సర్‌ను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స, జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక డిగ్రీ కళాశాల మైదానంలో గ్రేస్ క్యాన్సర్, సీఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి రూ.50లక్షలు..

జడ్చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి రూ.50లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వెల్లడించారు. కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అంతకుముందు ఆయన బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి పాల్గొన్నారు.

అవకాశాలు కల్పిస్తే రాణింపు



జిల్లా కేంద్రంలోని కెనరా బ్యాంక్‌లో మహిళలను సన్మానిస్తున్న అధికారులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఎక్కడైతే స్త్రీని గౌరవిస్తారో ఆ సమాజానికి మేలు చేకూరుతుందని కవి, రచయిత్రి పులి జమున అన్నారు. జిల్లా బ్యాంక్ ఎంప్లాయిస్ కో ఆర్డినేషన్ కమిటీ ప్రధాన కార్యదర్శి తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కెనరా బ్యాంక్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఏ రంగంలో తక్కువ కాదని, అవకాశాలు వస్తే ఎక్కడైనా రాణిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మమత, రాజేష్ పాల్గొన్నారు.

డీసీసీబీ ఆధ్వర్యంలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డీసీసీబీ మీటింగ్ హాల్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. డీసీసీబీ చైర్మన్ నిజాంపాష కేక్‌కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట



మహిళలను సన్మానించిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిల్‌కొండ: మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామ పంచాయతీ మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు విద్యా, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో పెద్దపీట వేసిందన్నారు. షీటీమ్స్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, అమ్మ ఒడి, కేసీఆర్ కిట్టు ఆదర్శంగా నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శశికళ, సర్పంచ్‌లు కల్పన, రజిత, చంద్రకళ, ఎంపీటీసీలు నిరూపరాణి, రోజా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబే బరాత్ జాగరణలు



జిల్లా కేంద్రంలోని జామియ మసీదులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్: ముస్లింలు మంగళవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా షబే బరాత్ జాగరణలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దల పండుగను చేసుకొని స్వర్గస్తులైన వారికి తర్పణాలు చేశారు. తెల్లవారేదాకా జాగరణ చేసి అల్లాను ఆరాధించారు. ముస్లింలు రాత్రుల్లో క్షమాభిక్షను కోరుతూ ఇంటిల్లిపాదీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రంతా స్థానిక మసీదుల్లోనే ఉండి ఖురాన్‌ను పటిస్తూ, తహజ్జుద్ అనే నమాజు చేయగా, చిన్నారులు, యువత నాతే షరీఫ్‌లను ఆలపించారు. మతపెద్దలు ధార్మిక సందేశాలు ఇచ్చారు. షబే బరాత్ ప్రాశస్త్యం గురించి వివరించారు. జిల్లా కేంద్రంలోని జామియా, మక్కా, మదీనా, గోల్, రహెమానియా, కౌసర్ మసీదులు, రైల్వేస్టేషన్, మోతీనగర్, వీరన్న పేట, తిరుమల్ దేవ్ గుట్ట, షాసాబ్ గుట్ట మసీదులతో పాటు ఎదిర రెవెన్యూ వార్డు, తిమ్మసానిపల్లిలోని మసీదుల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనల అనంతరం అర్ధరాత్రి ముస్లిం శ్మశాన వాటికలను సందర్శించి, దివంగతులైన తమ కుటుంబీకులకు స్వర్గాన్ని ప్రాప్తింపజేయాలని దువా చేశారు.

వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ నిలపాలి

దేవరకద్ర: స్థానిక రైల్వేస్టేషన్‌లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేలా చూడాలని బీజేపీ మండల అధ్యక్షుడు అంజన్‌కుమార్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, నారాయణరెడ్డి, జితేందర్‌రెడ్డి బుధవారం మహబూబ్‌నగర్ వచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కేంద్రం కావడంతో పాటు దేవరకద్ర రైల్వేస్టేషన్ జంక్షన్‌గా గుర్తింపు పొందిందని తెలిపారు. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ ఆపకపోవడంతో తిరుపతి వెళ్లే భక్తులు మహబూబ్‌నగర్ వెళ్లాల్సి వస్తున్నదని అన్నారు.

కారును ఢీకొట్టిన ఆటో

మహమ్మదాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన రవీంద్ర మంగళవారం రాత్రి కోస్గి వైపు కారులో వెళ్తున్నాడు. రంగారెడ్డిపల్లి సమీపంలోకి రాగానే వేగంగా వస్తున్న ఆటో కారును ఢీకొట్టింది. ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కారు దెబ్బతింది. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదయ్య తెలిపారు.

తవ్వకాలు నిలిపాలి

చిన్నచింతకుట: కురుమూర్తి స్వామి గుట్ట వెనక భాగంలో అక్రమంగా తవ్వుతున్న క్వారీ పనులను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు. బుధవారం తవ్వకాల క్వారీ వద్ద రైతులతో నిరసన వ్యక్తం చేశారు.